సాక్షి
వరంగల్
బుధవారం | 10 | జూలై | 2024



ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. - 8లో▸



వరుస తనిఖీలతో వణుకు

వరంగల్ ఎంజీఎంలో అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ ఆస్పత్రిలో స్వయంగా పరిశీలించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32^0 /26^0

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం, రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన 'కుడా' చైర్మన్



కాశోజీ సెంటర్: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డి మంగళవారం కలెక్టర్ సత్య శారదాదేవిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారదా దేవి 'కుడా' వెంకట్రామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

నాగమయ్యగుడిలో ఏసీపీ పూజలు

గీసుకొండ: ఊకల్‌హవేలిలోని ప్రసిద్ధ నాగేంద్ర స్వామి ఆలయంలో వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయనకు అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అర్చనలు చేసి తీర్థప్రసాదం అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: విదేశాల్లో చదివేందుకు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులైన మైనార్టీ విద్యార్థినీవిద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి డి.సౌజన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్ప్రింగ్ సీజన్ అడ్మిషన్ తీసుకున్న అర్హత గల అభ్యర్థులు వచ్చే నెల 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 9550560175, 0870-2980533 నంబర్లలో లేదా హనుమకొండ సర్క్యూట్‌హౌస్ రోడ్డులోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఆర్డీఓ ఆఫీస్‌లో ప్రైవేట్ వ్యక్తులదే హవా

- ప్రజలు ఆఫీస్ చుట్టూ తిరిగినా కదలని ఫైల్
- కలెక్టర్ మేడమ్ నజర్ పెట్టాలని కోరుతున్న జనం



కాశోజీ సెంటర్: వరంగల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో(ఆర్డీఓ) ప్రైవేట్ వ్యక్తుల హవా కొనసాగుతోంది. కార్యాలయంలో పైరవీకారులు చెబితే వెంటనే ఫైల్ కదులుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్డీఓ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో కొంతమంది మధ్యవర్తులు రికార్డులను తారుమారు చేస్తున్నట్లు వినికిడి. వీటిని చక్కదిద్దేందుకు ప్రైవేట్ వ్యక్తులు సంబంధిత సెక్షన్ అధికారులతో బేరం కుదుర్చుకుని ఫైల్‌ను క్లీయర్ చేయిస్తున్నట్లు సమాచారం. ఏదైనా సమస్యపై కార్యాలయానికి వస్తే అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని పనిమీద ఆఫీస్‌కు వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన సిదాం దత్తు అసిఫాబాద్‌లో పనిచేసిన కాలంలో భూసేకరణ విషయంలో అక్రమాలకు పాల్పడ్డాడని ఏసీబీ అధికారులు గత నెల 29న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సిదాం దత్తు స్థానంలో నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణికి అదనపు బాధ్యతలు అప్పగించడంతో పాలన సక్రమంగా జరగడం లేదని పలువురి ఆరోపణ. కలెక్టర్ మేడం దృష్టిసారించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలకు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 13, 14వ తేదీల్లో జరగనున్న 9వ తెలంగాణ సబ్ జూనియర్స్, జూనియర్స్ అంతర్‌జిల్లాల స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు మంగళవారం ఎంపికలు నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు 45మంది హాజరైనట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల స్వామిచరణ్ తెలిపారు. అండర్- 7, 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17 కేటగిరీలో బాలబాలికలు ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, బటర్‌ఫ్లై, ఇండివిజువల్ మిడ్‌లే విభాగాల్లో జరిగే పోటీలకు ఎంపికలు నిర్వహించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఆగస్టు 11వ తేదీన భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలో స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ సునీల్‌రెడ్డి, ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ రాయబారపు నవీన్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరెక్షనయ్యేనా..?

రేషన్ కార్డుల్లో సవరణ కాక ఆందోళన

- వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాల మార్పే కారణం
- ఏడు మండలాలు అటు, ఇటు మారడంతో ఇబ్బందులు
- కరెక్షన్ వివరాలు తీసుకుంటున్నా చివర్లో ఎర్రర్
- ఇబ్బందుల్లో వందలాది మంది దరఖాస్తుదారులు



కరెక్షన్ వివరాలు అన్ని నమోదు చేశాక సబ్మిట్ సమయంలో వస్తున్న ఎర్రర్

సాక్షి, వరంగల్: ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందాలన్నా.. రేషన్ కార్డు తప్పనిసరి అటాచ్ చేయాల్సి ఉంటుంది. దీంతో అవసరమైనవారు ఎప్పటికప్పుడు రేషన్ కార్డులో కరెక్షన్ చేయించుకుంటారు.. ఈక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాలోని ఏడు మండలాల ప్రజలకు ఈ పని ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. జిల్లాల పునర్విభజన సమయంలో ఉమ్మడి వరంగల్‌ను ఆరుజిల్లాలుగా విభించారు. అందులో ఒకటి వరంగల్ రూరల్ జిల్లా. ఈ జిల్లా పేరును తర్వాత కేవలం వరంగల్‌గా ప్రభుత్వం మార్చింది. ఈక్రమంలో 2021 ఆగస్టు 11న వరంగల్ రూరల్ జిల్లాలోని నడికూడ, పరకాల, దామెర, ఆత్మకూరు, శాయంపేట మండలాలను వరంగల్ అర్బన్ జిల్లాలో కలుపుతూ.. వరంగల్ అర్బన్ జిల్లా పేరును హనుమకొండ జిల్లాగా మార్చారు. అలాగే వరంగల్ అర్బన్ జిల్లాలో ఉన్న వరంగల్, ఖిలా వరంగల్ మండలాలను వరంగల్ రూరల్ జిల్లా పేరును వరంగల్ జిల్లాగా మారుస్తూ ఇందులో కలిపారు. సమస్య ఇక్కడే మొదలైంది. అయితే ఈ రెండు జిల్లాలు ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తుంది. కానీ, భౌగోళికంగా విడిపోయినా సాంకేతిక తిప్పలు తప్పడం లేదు. పేరుతోపాటు ఆ రెండు జిల్లాల్లో కలిసిన మండలాల ప్రజలకు ఇప్పుడు రేషన్ కార్డులో కరెక్షన్ పెద్ద తలనొప్పిగా మారింది. ఈమధ్యకాలంలో పుట్టిన పిల్లల పేరు రేషన్ కార్డులో చేర్పించుకునేందుకు వెళ్తే ఫలితం లేకుండాపోతుంది. మీ సేవా కేంద్రాల్లో సంబంధిత సైట్‌లో అన్ని వివరాలు అప్‌లోడ్ చేశాక చివరకు సబ్‌మిట్ చేసే సమయంలో ఎర్రర్ వచ్చి ఆ దరఖాస్తును తీసుకోవడంలేదు. దీంతో నిరుత్సాహంతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మీ సేవా నిర్వాహకులకు కూడా పని ఒత్తిడి పెరిగి ప్రభుత్వానికి రావాల్సిన ఫీజు జమ కాక వాళ్ల కష్టం వృథా అవుతోంది. ప్రైవేట్ మీ సేవా నిర్వాహకులకు కూడా దరఖాస్తుదారులు భారీగా వచ్చినా అంతా కష్టపడ్డాక ఆ దరఖాస్తు పూర్తి కాకపోవడంతో సమయం వృథా అవుతోంది.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

వరంగల్, హనుమకొండ జిల్లాలోని ఏడు మండలాల ప్రజలకు తప్ప మిగిలిన మండలాల్లో దరఖాస్తుదారుల కరెక్షన్ సంబంధిత సైట్‌లో సజావుగా పూర్తవుతుంది. దరఖాస్తుదారుని పేరులో తప్పుంటే మార్పులు, చిరునామా మార్పులు, చనిపోయిన వాళ్ల పేరు తొలగించడం.. తదితర సవరణలను సైట్ తీసుకుంటుంది. గత రెండు రోజుల నుంచి ఈ సైట్ ఓపెన్ కావడంతో దరఖాస్తుదారులు మీ సేవా కేంద్రాలకు బారులుదీరుతున్నారు. ఈ సమయంలోనే వరంగల్, హనుమకొండ జిల్లాలోని ఏడు మండలాల ప్రజల దరఖాస్తుల కరెక్షన్ కాకపోవడంలేదు. దీనిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పెండింగ్‌లోనే ఉంది..

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రేషన్ కార్డులో మా పాప పేరు చేర్చేందుకు దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు ఇంకా పెండింగ్ అనే చూపెడుతుంది. ఇప్పుడు మరో పాప పేరు యాడ్ చేసుకునేందుకు వెళితే కూడా అదే సమస్య. అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలి. – రాజు, దరఖాస్తుదారు

దరఖాస్తు పూర్తి కాలేదు

మాకు ఐదేళ్ల పాప ఉంది. ఆమె పేరు రేషన్ కార్డులో చేరుద్దామని మీ సేవా కేంద్రంలోకి వెళ్లాం. సంబంధిత సైట్ ద్వారా అన్ని వివరాలు సమర్పించాక సబ్‌మిషన్ సమయంలో ఎర్రర్ అని వచ్చింది. సమస్యను అధికారులు త్వరగా పరిష్కరించాలి. – ఎం.సతీశ్, ఖిలావరంగల్ మండలం

మత్తు వదల..రా!

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న గంజాయి వాడకం

- ఈ నెల 4న నగరంలోని మిల్స్‌కాలనీ పీఎస్‌కు కూతవేటు దూరంలో గల కాశికుంటలో గంజాయి మత్తులో మైనర్లు (బాలురు, బాలికలు) హల్‌చల్ చేశారు. రహదారులపై వెళ్తున్న వారిని దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. బ్లేడ్స్ చూపుతూ భయభ్రాంతులకు గురిచేశారు.
- గత నెల 30వ తేదీ రాత్రి గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీలో ఓ యువకుడిపై అదే కాలనీకి చెందిన కొందరు యువకులు (గంజాయి సేవించే గ్యాంగ్) దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు.

- మత్తులో తూగుతున్న యువత.. రాత్రివేళ దాడులు
- వాట్సాప్‌లో అమ్మకం అడ్డాలు.. టైమ్, ప్లేస్‌ల మెసేజ్‌లు
- పోలీసుల దాడులు.. అయినా ఆగని దందా
- గంజాయి ఫ్రీ కమిషనరేట్‌గా ఎప్పుడు మారేనో..?

కమిషనరేట్‌లో గంజాయి కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు	అరెస్టు
2021	99	268
2022	82	260
2023	75	166
2024	31	72

వరంగల్ క్రైం:

ఈ ఘటనలు కొన్ని మచ్చుకు మాత్రమే. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల గంజాయి మత్తులో యువత చేస్తున్న హల్‌చల్ తీవ్ర చర్చనీయాంశమవుతోంది. గంజాయి అమ్మకాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా అమ్మకాలు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గంజాయి మత్తులో యువత దాడులకు తెగబడడం, బెదిరించి డబ్బులు లాక్కోవడం ఘటనలు ఎక్కువగా వరంగల్ పరిధిలో జరుగుతున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు చాలాకాలంగా కమిషనరేట్‌ను గంజాయి ఫ్రీగా మార్చడానికి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న చీకటి దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో ఎక్కడినుంచి ఎక్కడికి పోతుందో ఎవరూ పసిగట్టలేకపోతున్నారు. పక్కా సమాచారం ఉంటే తప్ప వీటి అమ్మకాలను నియంత్రించడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. హైదరాబాద్ తరువాత విద్యా కేంద్రంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు ట్రై సిటీస్ గుర్తింపు పొందాయి. దీంతో స్మగ్లర్లు, అమ్మకందారులు ఈ ప్రాంతాలను టార్గెట్ చేసుకున్నారు.

వాట్సాప్‌లో అమ్మకం అడ్డాలు..

సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న యువత దానినే గంజాయి అమ్మకం అడ్డాలుగా మార్చుకుంటోంది. గంజాయిని సేవించే వారితో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని కోడ్ భాషలో పోస్టులు పెడుతూ అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. గంజాయిని సేవించే వారే చిన్న చిన్న మొత్తంలో గంజాయిని అమ్ముతున్నట్లు సమాచారం. రాత్రి 7 నుంచి 9 గంటల ప్రాంతాల్లో వాట్సాప్ గ్రూప్‌లో పేర్కొన్న అడ్డాకు అమ్మకందారుడు వచ్చి ప్యాకెట్లు ఇచ్చి వెళ్తున్నట్లు సమాచారం. పోలీసుల లెక్కల ప్రకారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి వాడకం పెరిగినట్లు తెలుస్తోంది. ఒకప్పుడు మాస్ ఏరియాల్లో గంజాయిని అధికంగా వాడేవారు. కానీ, ప్రస్తుతం క్లాస్ ఏరియాలో కూడా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

కేసులు 31.. అరెస్టు 72 మంది

పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు 31 కేసులు నమోదు కాగా 72 మంది అమ్మకందారులను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఈస్ట్ జోన్ పరిధిలో 4 కేసులు నమోదు కాగా అందులో 11 మందిని అరెస్టు చేశారు. అత్యధికంగా 6 కిలోల గంజాయి పట్టుకున్నారు. సెంట్రల్ జోన్ పరిదిలో 25 కేసులు నమోదు కాగా 57 మంది అరెస్టయ్యారు. అత్యధికంగా 201 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో 2 కేసులు నమోదు కాగా నలుగురిని అరెస్ట్ చేశారు.

520 కిలోల గంజాయి దగ్ధం



దగ్ధం చేసేందుకు తరలించిన గంజాయితో పోలీస్ అధికారులు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్మగ్లర్ల వద్ద పట్టుబడిన 520 కిలోల గంజాయిని పోలీస్ అధికారులు మంగళవారం దగ్ధం చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగం అదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.1.30 కోట్ల విలువైన గంజాయిని డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారిపేట ప్రాంతంలో కాల్చి బూడిద చేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఏనుమాముల ఎస్సై నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాకింగ్ డాగ్స్‌ను వినియోగిస్తున్నాం..



వరంగల్ పోలీస్ కమిషనరేట్‌ను గంజాయి ఫ్రీ గా మార్చటానికి తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నాం. దీనికోసం కొత్తగా ట్రాకింగ్ డాగ్స్‌ను వినియోగిస్తున్నాం. ప్రత్యేకంగా డాగ్స్‌కు శిక్షణ ఇస్తున్నాం. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కమిషనరేట్ బార్డర్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా గంజాయి సమాచారం పోలీసులకు తెలియజేయాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. – సీపీ అంబర్ కిషోర్ ఝా

నాణ్యమైన విద్య అందించాలి



ఖిలా వరంగల్: తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదా దేవి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, వివిధ శాఖల అధికారులు

- కరీమాబాద్ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ
- విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ సత్యశారదాదేవి

ఖిలా వరంగల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ సత్య శారదా దేవి ఉపాధ్యాయులకు సూచించారు. వరంగల్ కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. పుస్తకాలు, స్కూల్ యూనిఫాం ఇచ్చారా..? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా గుర్తించి మౌలిక సదుపాయాల కల్పన పూర్తయిందని, మిగిలిఉన్న టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత తరగతి గదులు, పాఠశాల అవరణ పరిశీలిస్తూ సమర్థవంతమైన నిర్వహణకు ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతోపాటు పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవి, జయ ప్రకాశ్, ఆదర్శ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

43 శాతం మొక్కలు నాటాం

కాశోజీ సెంటర్: వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో నిర్దేశించిన 25.58లక్షల మొక్కలకు ఇప్పటి వరకు 43శాతం మొక్కలు నాటామని కలెక్టర్ సత్య శారదాదేవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారదాదేవి మాట్లాడుతూ.. జిల్లాలో పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్‌లలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇంటింటికీ మొక్కల పంపిణీతోపాటు సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా మహిళా క్యాంటీన్లు, మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాల పంపిణీ చివరి దశకు చేరాయని తెలిపారు. పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాల లభ్యత అంశం పై సంబంధిత అధికారులతో నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు, పారిశుద్ధ్య నిర్వహణపై పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కరణ వేగంగా చేస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మానవ, బాలల అక్రమ రవాణా నేరం

నర్సంపేట: మానవ, బాలల అక్రమ రవాణా నేరమని, దీనిని నిర్మూలించడం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని నర్సంపేట ఏసీపీ వల్లూరి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో 'మానవ, బాలల అక్రమ రవాణాను అరికడదాం' అని ముద్రించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఏసీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. మానవ, బాలల అక్రమ రవాణా చేయడం నేరం అన్నారు. వ్యభిచార గృహాల్లో విక్రయించడం, అవయవాల కోసం, బానిసలుగా పని చేయించడం కోసం బాలలను విక్రయించడం సరికాదన్నారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులతో మహిళలు, ఆడపిల్లలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల ప్రవర్తనపై ఏ మాత్రం అనుమానం కలిగినా పోలీస్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టోల్ ఫ్రీ నంబర్స్‌కి కాల్ చేసి, సాయం పొందాలని తెలిపారు.

వరంగల్ జెడ్పీ పరిధిలో 71మంది బదిలీ ?

వరంగల్: వరంగల్ జిల్లా పరిషత్ పరిధిలోని కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఒకే చోట నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 71మందికి బదిలీలు జరిగే అవకాశాలున్నాయి. జెడ్పీలో కేడర్ల వారీగా జూనియర్ అసిస్టెంట్లు (40), టైపిస్టులు(12), రికార్డు అసిసెంట్లు(21), ఆఫీసు సబార్డినేట్లు(141), డ్రైవర్లు(2), నైట్‌వాచ్‌మెన్(15) పోస్టులు మొత్తం 231 పోస్టులు ఉన్నాయి. ఇందులో 23పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈక్రమంలో 40శాతం మందికి బదిలీలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈలెక్క ప్రకారం నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారికి స్థానచలనం తప్పనిసరి. బదిలీలు అయ్యే 71మంది ఉద్యోగుల్లో కేడర్ల వారీగా జూనియర్ అసిస్టెంట్లు 12మంది, టైపిస్టులు నలుగురు, రికార్డు అసిస్టెంట్లు ఐదుగురు, ఆఫీసు సబార్డినేట్లు 49మంది, నైట్ వాచ్‌మెన్ బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు జెడ్పీ అధికారుల ద్వారా తెలిసింది.

పని చేతకాకపోతే.. ఇంటి వద్దనే ఉండండి

- డీఆర్డీఓ కౌసల్యాదేవి



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఆర్డీఓ కౌసల్యాదేవి

చెన్నారావుపేట: పని చేతకాకపోతే ఇంటి వద్దనే ఉండండని డీఆర్డీఓ కౌసల్యాదేవి జాతీయ ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా 1 ఏప్రిల్ 2023 నుంచి 31మార్చి 2024 వరకు మండలంలోని 30 గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు జూన్ 20నుంచి 30వరకు సామాజిక తనిఖీలు చేపట్టారు. ఈనేపథ్యంలో తుది నివేదికను మండల స్థాయి ప్రజావేదికలో సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ కొంరయ్య ఆధ్వర్యంలో డీఆర్పీలు సమర్పించారు. గ్రామాల్లో కూలీలకు సంబంధించిన జాబ్ కార్డుల అప్డేషన్ చేయడం లేదని, కూలీలకు పే స్లిప్పులు అందించడం లేదని ఎంపీ రికార్డ్ బుక్కుల్లో కూలీల సంతకాలు తీసుకోవడం లేదని తెలిపారు. అంతేకాక పని ప్రదేశాల వద్ద సమాచార బోర్డులు లేవని, గ్రామ పంచాయతీలో సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయడం లేదన్నారు. రోజ్‌గార్ నివాస్ నిర్వహించడం లేదని, పనులకు సంబంధించిన ఫొటోలు చూపించడం లేదని, ఏడు రకాల రిజిస్టర్స్ అప్‌డేట్ లేవని వివరించారు. కొలతల పుస్తకంలో రైతులు, కూలీల సంతకాలు తీసుకోవడం లేదని తెలిపారు.

గ్రామాల్లో రోడ్ల పక్కన నాటిన మొక్కలకు సంరక్షణ నిర్వహించడం లేదని చెప్పారు. దీంతో డీఆర్డీఓ కౌసల్యదేవి ఏపీఓ అరుణ, ఈసీ కిశోర్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'విధులకు ఎందుకు వస్తున్నారు.. చేతనైతేనే ఉద్యోగాలు చేయండి.. లేదంటే ఇంటి వద్దనే ఉండండి' అంటూ.. మండిపడ్డారు. అవినీతి అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనితీరు మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. కోనాపురంలో నలుగురు వ్యక్తులు ఇంకుడు గుంతలు తీసుకుంటే రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటికీ బిల్లులు ఎందుకు చెల్లించలేదని ఏఫ్ఏపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో ఉపాధిహామీ విజిలెన్స్ హెచ్ఆర్ మాధవి, సోషల్ ఆడిట్ స్టేట్ టీమ్ మెంబర్ సాయి జ్ఞానేందర్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ హరీశ్, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ కొంరయ్య, ఎంపీడీఓ దయాకర్, ఎంపీఓ శ్రీధర్‌రాజు, ఏపీఓ అరుణ, ఈసీ కిషోర్, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రేపు టూ-డే క్రికెట్ జట్టు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల రెండో వారంలో హైదరాబాద్‌లో జరగనున్న టూ–డే లీగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 11వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఎంపిక పోటీలకు 25 సంవత్సరాల లోపు (1999 ఆగస్టు 31 తర్వాత జన్మించిన) వయసు గల క్రీడాకారులు అర్హులుగా తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ, ఒరిజనల్ ఆధార్ కార్డు, సొంత క్రికెట్ కిట్, యూనిఫామ్‌తో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9849570979 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ట్యాబ్లెట్లు మింగి వ్యక్తి ఆత్మహత్య

● చల్లగరిగలో ఘటన



శివరామకృష్ణ (ఫైల్)

చిట్యాల: భార్య కాపురానికి రాకుండా కోర్టు నుంచి విడాకుల నోటీసు పంపడంతో మనస్తాపం చెందిన భర్త అధికంగా ట్యాబ్లెట్లు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పినిగాని శివరామకృష్ణ (34)కు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తికి చెందిన కూచన మారుతితో వివాహం జరిగింది. వీరి కాపురం కొంతకాలం సజావుగా జరిగింది. అనంతరం కుటుంబ కలహాలతో మారుతి తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. కాపురానికి రాకుండా కోర్టు ద్వారా విడాకుల నోటీసులు పంపింది. దీంతో మనస్తాపం చెందిన శివరామకృష్ణ మంగళవారం తెల్లవారుజామున ట్యాబ్లెట్లు అధికంగా మింగడంతో స్పృహ కోల్పోయాడు. దీనిని తండ్రి రాజేందర్ గమనించి శివరామకృష్ణను హుటాహుటిన వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటనపై తన కుమారుడి మృతికి కారణమైన అతడి భార్య మారుతి, మామ నర్సింగం, అత్త లక్ష్మి, బావమరిది రాజేంద్రప్రసాద్‌పై మృతుడి తండ్రి రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో మహిళ ..



సునీత మృతదేహం

ఎల్కతుర్తి: తన బిడ్డ పెళ్లికోసం చేసిన అప్పు ఎలా తీరుతుందోనని మనస్తాపం చెందిన ఓ మహిళ.. విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం వంగరంలో చోటు చేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏలూరి సునీత(40) తన కూతురు పెళ్లి కోసం రూ.15 లక్షల అప్పు చేసింది. అప్పుకు వడ్డీ పెరగడంతో సొంత ఇల్లు కూడా అమ్మి కొంత అప్పు చెల్లించింది. అయినా అప్పు తేరలేదు. దీంతో అప్పు ఎలా తీరుతుందోనని మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉంది.

భార్యను హత్య చేసి.. భర్త ఆత్మహత్య

● వరంగల్ నగరంలో ఘటన
● అనాథలైన ముగ్గురు పిల్లలు



మంద చరణ్, స్వప్న(ఫైల్)



అనాథలైన ముగ్గురు పిల్లలు



ఆర్థిక సాయం అందజేస్తున్న మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య

కాశిబుగ్గ : కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన భర్త తనూ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి చనిపోవడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఈ ఘటన వరంగల్ నగరంలోని చెన్నారెడ్డికాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారెడ్డికాలనీకి చెందిన మంద చరణ్(45) అలియాస్ చేరాలు ఉర్సుకు చెందిన అక్క కూతురు స్వప్న(42)ను 18 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చరణ్ మేస్త్రీ పనిచేస్తుండగా, స్వప్న నగరంలోని ఓ బట్టల షాపులో పనిచేస్తుంది. ఇరువురి కాపురం కొన్నేళ్లు బాగానే సాగింది. తరువాత ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో చరణ్ సోమవారం సాయంత్రం ముగ్గురు పిల్లలను ఉర్సులోని మేనమామ ఇంటికి పంపించాడు. అర్ధరాత్రి సమయంలో స్వప్నను రోకలిబండతో తీవ్రంగా కొట్టి చంపాడు. అనంతరం భయాందోళనకు గురైన చరణ్ మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. 11.30 గంటల సమయంలో మేనమామ ఇంటి నుంచి తిరిగి వచ్చిన పిల్లలు డోరు తీసేందుకు ప్రయత్నించగా రాలేదు. వెనుక వైపునుంచి ఇంట్లోకి వెళ్లగా తల్లిదండ్రులు మృతిచెంది రక్తం మడుగులో ఉన్నారు. వెంటనే భయంతో స్థానికులకు తెలిపారు. వాళ్లు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్, మిల్స్‌కాలనీ సీఐ మల్ల య్య క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

అనాథలైన ముగ్గురు పిల్లలు..

కుటుంబ కలహాలు, క్షణికావేశంతో తల్లిదండ్రులు ఇద్దరు ఒకేసారి మృతిచెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. రెండో కూతురు మెర్సి(12)కి గుండెలో రంధ్రం ఉంది. అలాగే కుమారుడు షాలుమ్(11) అంధుడు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో వీరిని ఎవరు చూసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాతృత్వం చాటిన పోలీసులు, స్థానికులు..

తల్లిదండ్రులు చనిపోవడంతో అంత్యక్రియలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో దీనంగా చూస్తున్న పిల్లలను చూసి చలించిన పోలీసులు, స్థానికులు ఆర్థికసాయం చేశారు. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య రూ.10వేలు, ఇద్దరు ఎస్సైలు చందర్, శ్రీకాంత్‌లు చేరో రూ.5వేలు, స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ చేరో రూ. 5 వేలు, గడ్డమీది రాజేష్, లాయర్ మామిడాల రమేష్‌లు చేరో రూ.3వేలు అందించారు. కాలనీవాసులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.

వరుస తనిఖీలతో వణుకు..

● ఎంజీఎంలో కొనసాగుతున్న తనిఖీలు
● నాలుగో రోజు ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్ఓ వెంకటరమణ
● అధికారులు, వైద్యుల్లో భయం..భయం



ఉదయం 10.30 గంటలకు చికిత్స పొందుతున్న రోగులు

ఎంజీఎం : వరంగల్ ఎంజీఎంలో అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ.. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో స్వయంగా పరిశీలించారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ పర్యటించిన అనంతరం సమీక్షలో పేర్కొన్న అంశాల మేరకు సార్టింగ్ ఓపీ, రోగులకు బెంచీలు, వైద్యులు మెమోలు పూర్తిస్థాయిలో ఇచ్చారా లేదా అనే అంశాలను కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ పరిశీలించారు. సార్టింగ్ ఓపీని మూడు రోజులైనా సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ప్రారంభించలేదనే విషయం గుర్తించారు. అంతే కాకుండా వైద్యుల కొరత ఉందని కలెక్టర్ సమీక్షలో పేర్కొన్న సూపరింటెండెంట్.. కొంత మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యులను ఓపీ, క్యాజువాలిటీ విధులకు పంపించకుండా అడిషనల్ ఆర్ఎంఓలుగా తన వద్దే ఉంచుకోవడం ఆస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది.

కాన్ఫరెన్స్ హాల్‌ను ఓపీగా మార్చే పనులు ప్రారంభమెప్పుడు?

ప్రస్తుతం కొనసాగుతున్న సూపరింటెండెంట్ కార్యాలయం.. డెర్మటాలజీ ఓపీ విభాగంగా కొనసాగేది. ఆస్పత్రికి కేటాయించిన నిధులతో డెర్మటాలజీ ఓపీ గదులను సూపరింటెండెంట్ చంద్రశేఖర్ లక్షలాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ హంగులతో నిర్మించారు. ఈ క్రమంలో డెర్మటాలజీ ఓపీ కిక్కిరిసిపోవడంతో విభాగాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌కు తరలించారు. శనివారం ఓపీని సందర్శించిన కలెక్టర్.. రద్దీగా ఉన్న విషయాన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమీ చేయలేమా అని సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. ప్రత్యామ్నాయం ఏం చేయలేమని, ఎక్కడా స్థలం లేదని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో ఇంత పెద్ద హాల్ సమావేశాలకు ఎందుకని, వైద్యసేవలకు మార్చాలన్నారు. రోగులకు మెరుగైన సేవలందించడమనే లక్ష్యమని, సమావేశాలు కాకతీయ మెడికల్ కళాశాలతోపాటు ఆస్పత్రిలో పలు ప్రదేశాల్లో నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేశారు. వెంటనే సమావేశ మందిరాన్ని నిత్యం రద్దీగా ఉండే మరో మెడిసిన్ ఓపీగా మార్చాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన సమయంలో సరే అని అంగీకరించిన సూపరింటెండెంట్.. ఆ దిశగా అడుగులు వేస్తాడా..? ఇష్టంగా నిర్మించుకున్న కార్యాలయాన్ని కొనసాగించే ప్రయత్నాలు చేస్తాడా అనే విషయం ఆస్పత్రిలో చర్చగా మారింది.

సమయపాలనతో రోగులకు మెరుగైన సేవలు..

బయోమెట్రిక్ హాజరుశాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలిస్తుండడంతో ఓపీ సమయానికి వైద్యులు విధులకు వస్తున్నారు. 90 శాతం మంది వైద్యులు విధులకు హాజరవుతుండగా 10 శాతం మాత్రం ఇంకా తీరు మార్చుకోవడం లేదు. కాగా, నిత్యం ఒంట గంట పాటు వైద్యం కోసం కుస్తీ పట్టే రోగులు.. ప్రస్తుతం 11 గంటల వరకే చికిత్సలు పొంది ఇంటికి వెళ్తున్నారు,

అధికారులు, వైద్యుల్లో భయం.. భయం

నాలుగు రోజుల నుంచి ఎంజీఎం ఆస్పత్రిని కలెక్టర్‌తోపాటు ఆర్‌డీఓ, డీఎంహెచ్ఓ నిత్యం తనిఖీలు చేస్తూ పాలనపై ప్రత్యేక దృష్టిసారించారు. కలెక్టర్ ఆదేశాలు సూపరింటెండెంట్, వైద్యులు ఏ మాత్రం పాటిస్తున్నారో అనే అంశంపై నిత్యం తనిఖీలతో ఆస్పత్రిలో అంతా హడావిడి నెలకొంది. దీంతో అధికారులు, వైద్యుల్లో భయం నెలకొంది. కాగా, రోగుల బాగోగులపై ఇలా జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు ముందుకెళ్లడంపై పేద రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి పూర్తిస్థాయిలో గాడిన పడే వరకూ అధికారులు దృష్టి సారించాలని వారు వేడుకుంటున్నారు.

కానిస్టేబుల్ దూషించాడని.. యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ఉదయ్ కుమార్

మహబూబాబాద్ రూరల్ : కానిస్టేబుల్ తనను అకారణంగా అసభ్యకర పదజాలంతో దూషించాడని ఆరోపిస్తూ ఓ యువకుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం ... మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని చాపల మార్కెట్ బజారుకు చెందిన బత్తిని ఉదయకుమార్ తనకు ఒకరి వద్ద నుంచి డబ్బులు రావాల్సి ఉండగా అందుకు సంబంధించిన ఫిర్యాదు ఇచ్చేందుకుగాను మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అదే సమయంలో అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రుద్రయ్య విషయం ఏమిటని ఉదయ్ కుమార్‌ను అడగగా తనకు డబ్బులు రావాల్సి ఉండగా ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చానని, అన్నా అంటూ సంబోధిస్తూ తెలిపాడు. ఇందుకు ఆగ్రహించిన కానిస్టేబుల్ రుద్రయ్య.. నన్ను అన్న అంటావా.. నువ్వు ఒక రౌడీషీటర్ అని అనడమే కాకుండా చెప్పలేని విధంగా అసభ్యకర పదజాలంతో దూషించాడు. దీంతో మనస్తాపన గురైన ఉదయ్ కుమార్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై టౌన్ సీఐ దేవేందర్‌ను వివరణ కోరగా బాధితుడి ఆరోపణ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక..

● విద్యార్థిని బలవన్మరణం
● నమిలిగొండలో ఘటన
● శోకసంద్రంలో కుటుంబీకులు



రితీష (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నమిలిగొండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దపూండ్ర స్వాతి, శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె రితీష (16) శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదివింది. ఇంటర్ విద్య కోసం తల్లిదండ్రులు.. రితీషను భీమదేవరపల్లిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో చేర్పించారు. అయితే అక్కడ హాస్టల్‌లో ఉండి చదవడం ఇష్టం లేదని చెప్పగా నచ్చచెప్పారు. ఈ క్రమంలో ఇటీవల తల్లిదండ్రులకు ఫోన్ చేసి హాస్టల్‌లో ఉండనని చెప్పడంతో తండ్రి వెళ్లి రితీషను ఇంటికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన (ఆదివారం) తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా రితీష గడ్డి నివారణ మందు తాగి ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో వ్యవసాయ బావుల వైపునకు వెళ్తున్న వారికి తాను గడ్డి నివారణ మందు తాగానని, మా నాన్నకు చెప్పాలని పేర్కొంది. దీంతో వారు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. తల్లిదండ్రులు వెంటనే ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న రితీషను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె అర్ధాంతరంగా తనువు చాలించడంతో మృతదేహంపై పడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐరాజు తెలిపారు. కాగా, నమిలిగొండకు చెందిన బీఆర్ఎస్ మండల మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు పెద్దపూండ్ర స్వాతిరెడ్డి కుమార్తె రితీష మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కేయూకు 'రూసా' నిధులు

● రూ.45.50 కోట్ల విడుదలకు ఉత్తర్వులు



కేయూలో నిర్మించిన కే హబ్ భవనం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షాభియాన్ (రూసా) రూ.45.50 కోట్లు విడుదల చేసింది. యూనివర్సిటీ అధికారులు 2019–20లో కే హబ్ కోసం, సైన్స్ విభాగాల మధ్య మల్టీ డిస్టిపనరీ పరిశోధన ప్రాజెక్టులు, అధ్యాపకులు వ్యక్తిగతంగా పరిశోధనలు చేసేందుకు రూ.50 కోట్లతో రూసాకు ప్రతిపాదనలు పంపారు. అయితే కొంత నిధులు రాగా యూనివర్సిటీ క్యాంపస్‌లో కే (నాలెడ్జ్) హబ్ భవనం నిర్మించి మార్చిలో ప్రారంభించారు. కాగా కే హబ్‌లో మౌలిక వసతుల కల్పించాల్సి ఉంది. అప్పటి ప్రతిపాదనలలో మిగతా నిధులు రూ.45.50 కోట్లు విడుదల చేస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, రూసా ప్రాజెక్టు డైరెక్టర్ బుర్రా వెంకటేశం, పీఓ సౌందర్య జోసెఫ్ ఉత్తర్వులు జారీచేశారు.

రూ.35 కోట్లు పరిశోధనలకు వ్యయం

యూనివర్సిటీలో పరిశోధన ప్రాజెక్టులు, అధ్యాపకులు, వ్యక్తిగతంగా చేసే పరిశోధనలకు సంబంధించి రూసా నుంచి రూ.35 కోట్లు మంజూరు చేస్తూ నిధులు విడుదల అయ్యాయని సమాచారం. అందులో రూ.23 కోట్లతో ఐదు విభాగాలకు, మరో రూ.12 కోట్లు వ్యక్తిగతంగా పరిశోధన ప్రతిపాదనలు పంపిన వారికి కేటాయిస్తారు. ప్రాజెక్టులో భాగంగా పరికరాల కొనుగోలు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్స్ కోసం వివిధ రకాలైన పరిశోధనల నిమిత్తం ఉపయోగించుకుంటారు. నిధుల వినియోగంపై ఈనెల 8న హైదరాబాద్‌లో కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి చర్చించారని సమాచారం. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంవోయూలు కొనసాగించి పరిశోధనలతో ముందుకెళ్లాలని వాకాటి కరుణ కోరారని సంబంధిత అధికారులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

● మాజీ సర్పంచ్ బిల్లుల కోసం రూ.20 వేల డిమాండ్



ఏసీబీకి పట్టుబడిన శివాజీ

రఘునాథపల్లి: గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల మంజూరుకు తాజా మాజీ సర్పంచ్‌భర్తనుంచి లంచం డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపల్లి మండలం కంచనపల్లి మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వర్‌రావు 2023–24కు సంబంధించి గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకుగాను రూ.1.53 లక్షల బిల్లులను మార్చిలో ఎస్‌టీఓకు పంపగా ఫ్రీజింగ్ కారణంగా డ్రా కాలేదు. ఆ చెక్కు పనిచేయకపోవడంతో తిరిగి ఆ బిల్లులు పొందేందుకు పంచాయతీ కార్యదర్శి పగిడె శివాజీని కలిశాడు. రూ.50వేల లంచం కావాలని, లేకుంటే పని కాదని కార్యదర్శి తేల్చి చెప్పాడు. చివరికి రూ.20వేలకు శివాజీ ఒప్పుకున్నాడు. అనంతరం నాగేశ్వర్‌రావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు నాగేశ్వర్‌రావు మంగళవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి లంచం డబ్బులు ఇస్తానని సంప్రదించగా.. తాను మండల పరిషత్ కార్యాలయంలో ఉన్నానని, ఇక్కడికే రావాలని సూచించాడు. కార్యాలయానికి వెళ్లిన నాగేశ్వర్‌రావు రూ.20 వేలు శివాజీకి అందజేస్తుండగా అప్పటికే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పంచనామా నిర్వహించి కార్యదర్శిని అరెస్ట్ చేశారు. అతడిని కోర్టులో హాజరు పరుస్తామని, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064లో సంప్రదించాలని డీఎస్పీ పేర్కొన్నారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు ఏ.శ్యాంసుందర్, ఎస్ రాజు, ఎల్ రాజు ఉన్నారు.

నాలుగు నెలలుగా సతాయించాడు..

ఫ్రీజింగ్ కారణంగా చెక్ రిజెక్ట్ అయిందని, తిరిగి చెక్ జనరేట్ చేసేందుకు పంచాయతీ కార్యదర్శి నాలుగు నెలలుగా సతాయించాడని మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో తమను అవమానించేలా వ్యవహరించాడన్నారు. తాము నిజాయితీగా పనులు చేసిన ఎంబీ రికార్డుల మేరకే బిల్లుల కోసం సంప్రదిస్తే లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించాల్సి వచ్చిందని నాగేశ్వర్‌రావు తెలిపారు.

ప్రజలు గుణపాఠం చెప్పినా మోదీ వైఖరి మారలేదు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

రామన్నపేట : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణ పాఠం చెప్పినా ప్రధాని మోదీ వైఖరిలో మార్పు రాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. వరంగల్ కొత్తవాడలో సీపీఐ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన పార్టీ మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందు సీపీఐ పతాకాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన శిక్షణ తరగతుల ప్రారంభ సభలో చాడ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడంతోనే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేసి, అనేక మందిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తెచ్చారని, ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టారని, దాదాపు రూ. 12 లక్షల కోట్లు వారికి రాయితీ ఇచ్చారన్నారు. చివరకు తెలంగాణకు రావాల్సిన విభజన హామీలను కూడా అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఎన్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా,పనాస ప్రసాద్, నాయకులు గన్నారపు రమేష్, గుండె బద్రి, దామెర కృష్ణ, జన్ను రవి, వేల్పుల సారంగపాణి, రహేలా, అమ్జద్, రమేష్ పాల్గొన్నారు.

స్వల్పకాలిక వరి సాగుకు సిద్ధం కావాలి

● సహాయ వ్యవసాయ సంచాలకుడు నగేష్

నర్సంపేట : ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అనుసరించి రైతులు స్వల్ప కాలిక వరి రకాల సాగుకు సిద్ధం కావాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ కేసరి నగేష్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలు కేవలం పత్తి, మొక్కజొన్న పంటలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. అయితే రైతులు మాత్రం వరి నార్లు పోసుకుంటున్నారన్నారు. వరి పంటకు అనుకూలమైన వర్షపాతం ఇంత వరకు నమోదు కాలేదని, ఈ పరిస్థితుల్లో దీర్ఘకాలిక వరి రకాల సాగు ఆచరణ యోగ్యం కాదన్నారు. స్వల్ప కాలిక రకాలు 120–125 రోజుల పంట కాల వ్యవధి కలిగి ఉంటాయని, ఈ రకం సాగు వల్ల పంట త్వరగా కోతకు వస్తుందని తెలిపారు. యాసంగి పంటకు అనుకూలం, సాగు నీటి అవసరం కూడా తక్కువ ఉంటుందన్నారు.

స్వల్ప కాలిక వరి రకాలు..

వరి రకం	పంట కాలం	దిగుబడి
తెలంగాణ సోన(ఆర్ఎన్ఆర్–15048 125)	125	26–28
వరంగల్ వరి(డబ్ల్యూజీఎల్–1119)	115–120	28
కూనారం–వరి–2(కేఎన్ఎం–1638)	120–125	30–34
వరంగల్ వరి–2(డబ్ల్యూజీఎల్–962)	120–125	26–30
జగిత్యాల సాంబ(జేజీఎల్–3844)	120–125	26–28
జగిత్యాల సన్నాలు(జేజీఎల్–1798)	125	20–25
ఎర్రమల్లెలు(డబ్ల్యూజీఎల్–20471)	125	20–22
కూనారం వరి(కేఎన్ఎం–733)	120	29–33

ఈ రకాలు మన ప్రాంతానికి అనుకూల సన్నరకం వరి విత్తనాలని నగేష్ తెలిపారు. జూలై 20వ తేదీ వరకు నారు పోసుకోవడానికి అనుకూల రకాలన్నారు. డివిజన్ రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన రకాలు ఎంచుకుని సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు స్ప్రే పంపులు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

హన్మకొండ : పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్షయ్యపల్లి గ్రామంలో రైతులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దిలీప్‌కుమార్, రాములు, శ్రావణ్ కుమార్, మధు.. రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్తి పంటలో పాటించాల్సిన పద్ధతులను వివరించి, అధిక సాంద్రత పత్తితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా 40 మంది రైతులకు మందు పిచికారీ చేసే చేతి పంపులను ఉచితంగా అందించారు.